# పోలయ్య

విశలాపురాగ్రహారం వైదీకి బ్రాహ్మణ్యం పుట్ట. అనాది అగ్రహారం. ఆ అగ్రహారంలోగల రెండు వందల బ్రాహ్మణకుటుంబాలలోకీ వెంకటశాస్త్రి మకుటంవంటివాడు - గొప్ప తర్కశాస్త్ర పండితుడూ, వైయాకరణీ, నైష్ఠికుడూను. త్రికాలములా సంధ్యావందనం చేసుకోనిదే గంగ తాకడు. సనాతనధర్మం అన్నా, వర్ణాశ్రమధర్మంఅన్నా చెవి తెగ్గోసుకొంటాడు. చిన్నతనంలో తల్లిదండ్రుల్ని విడిచి కాశికి వెళ్లి పదేళ్లుగా గురుకులవాసంచేసి శాస్త్రం పఠించిన పండితశ్రేష్ఠుడు.

ఆయనకు పంచములంటే సుతలామూ సరిపడక పోవడం అంతగా ఆశ్చర్యకరమైన విషయం కాదు. పంచములంటే పనికిరాని బ్రాహ్మణోత్తము లెంతమందో లేకపోలేదు. కాని వెంకటశాస్త్రిమట్టుకు వాండ్ల విషయమై ప్రత్యేకకృషి చేశాడు. గాంధీగారు అస్పృశ్యతా నివారణోద్యమం ఆరంభించింది లగాయతు పంచములను గురించి ఆయన అనేక గ్రంథాలు తిరగేసి, కూలంకషంగా గాలించి పంచముల పుట్టుపూర్వోత్తరాలనుగూర్చి గొప్ప పరిశ్రమచేసిన పరిశోధకుడు. అసలు పంచములు హిందూ మతానికి సంబంధించినవారు కారని ఓం ప్రథమంలో నూతనసిద్ధాంతాన్ని లేవదీసిం దీమహానీయుడే!

ఆ బ్రాహ్మడికి వయస్సుముదిరినకొద్దీ, చేసిన గాఢమైన పరిశోధనాఫలితంవల్ల, చిన్నతనంలో ఆయనకు పంచములవిషయమై ఉండిన అభిప్రాయాలన్నీ వయస్సుతోకూడా ముదిరి, స్థిరపడి, నఖశిఖపర్యంతమూ గాటంగా నాటుకొనిపోయినవి. రానురాను ఈకృషిలో ఆయన కత్యంతమైన విశ్వాసమూ, ఆనందమూ కలుగుతూ వచ్చింది. అందువల్ల ఆయన కాశీ విడిచి, ఇల్లు చేసుకొని వివాహంచేసుకొన్నదిలగాయతూ, ఈముప్ఫై ఏళ్లుగా స్వగ్రామంలోనే బ్రాహ్మణవిద్యార్థులకు విద్యాదానం చేసుకొంటూ కాలక్షేపంచేస్తూ వచ్చినప్పటికీ, అస్పృశ్యతను తొలగించవలెననీ, పంచములకు హరిజనులని నూతన నామకరణంచేసి వారికి దేవాలయప్రవేశం కూడా ప్రసాదించవలెననీ - ఇట్లాంటి బిల్లులూ, ఉద్యమాలూ, ఉపన్యాసాలూ బయల్దేరేవరకు, ఆయన కాపాదమస్తకమూ ఒళ్లు కంపించిపోయి తనకళ్లయెదుట సనాతనధర్మం చచ్చిపోతూఉండగా, తనవంటివారు చూస్తూ చేతులు ముడుచుకొని కూర్చోవడం భావ్యం కాదని, సనాతనధర్మోద్ధరణకోసం నడుంకట్టి రణరంగంలోకి దూకినాడు. ఆక్షణం లగాయతూ నూతనోద్యమాన్ని రూపుమాపి సనాతనధర్మం స్థాపించే పనిమీద, ఆయన తిరగనన్ని దేశాలూ తిరిగి తిరిగి వేసరిపోతూ ఉన్నాడు.

ఇంటివద్ద సంసారం యావత్తూ చేతికెక్కివచ్చిన ఇరవై ఏళ్లకొడుక్కి వప్పగించి, మాలమాదిగలను పైకి రానియ్యకుండా చేసే కృషిమీద ఉత్తరహిందూదేశంలో పర్యటనం నిమిత్తం ఇప్పటికి రమారమి రెండేళ్లక్రిందట బయల్దేరి వెళ్లాడు. కాశీ, గయా, ప్రయాగా, బదరికావనం, ఢిల్లీ, పంజాబు, బరోడా వగైరా స్థలములలో అనేకమంది పండితులతో పంచములకు సంబంధించిన విషయాలన్నీ చర్చించి, కొత్తవిషయాలెన్నో సేకరిస్తూ, తన సిద్ధాంతాలను దృఢపర్చుకొంటున్నాడు. ఆఖరుకు పంచములు హిందూమతంవదలి అన్యమతాల్లో కలుస్తామని తీర్మానించుకొన్నట్టు వదంతి పుట్టేవరకు 'పీడ వదిలిం దని' వెంకటశాస్త్రి బ్రహ్మానందం పడుతున్నాడు.

ఇల్లువిడిచిన ఇరవై రెండు నెలలకు ఇంటిదగ్గర తనకొడుక్కి కొమారుడు కలిగాడనీ, ఆ సంవత్సరం మాఘశుద్ధ పంచమీ మంగళవారం ఉదయం ౯ గంటలకు మనుమడికి భారసాల జరపవలసి ఉందనీ, ఆనాటికి పెద్దవాడయిన తాతగారు తప్పక రావలసిందనీ, ఉత్తరాలమీద ఉత్తరాలూ, టెలిగ్రాములమీద టెలిగ్రాములూ రాగా, ఇక ముహూర్తం నాలుగురోజులుం

దనగా వెంకటశాస్త్రి కాశీలో బయల్దేరి ఎకాయెకీని సోమవారం రాత్రి ౧౧ గంటలకు తన గ్రామానికి సమీపంలో ఉన్న పుంజూరుస్టేషన్‌లో రైలు దిగాడు.

పుంజూరు నెల్లూరికి దక్షిణంగా పోతే మూడో స్టేషన్. ఆస్టేషన్ కొంచెం పెద్దస్టేషన్లోనే, అనగా సెకండుక్లాసు స్టేషన్లోనే లెఖ్ఖ అయినప్పటికీ, ఆరాత్రిమట్టుకు వెంకటశాస్త్రితోకూడా ఏ అయిదారు గురోకంటె జాస్తిగా జనం దిగలేదు. వెంకటశాస్త్రి రైలు దిగీదిగడంతోనే గేటులో టిక్కెట్టు ఇచ్చేసి, కాశీగంగచెంబులూ, తనగుడ్డలూ కలిపినమూట నొక చేత్తోనూ, జారీరాగిచెంబు మరొకచేత్తోనూ పట్టుకొని గేటుదాటి బయటికి వచ్చాడు.

పుంజూరుస్టేషన్‌కీ విశలాపురానికీ పద్ధెనిమిది మైళ్లు బరువుగా ఉన్నది. పదహారుమైళ్లు కంకరరోడ్డు మీదా, రెండుమైళ్లు మట్టిరోడ్డుమీదా పోవాలె. ఆరోడ్డుమీద రాత్రి అనకుండా, పగలనకుండా ఎప్పుడూ ఎడతెరపిలేని రహదారీ ఉంటూ ఉండేది. ఆ రోడ్డు పుంజూరునుండి గంగపట్నంమీదుగా తూర్పు సోమేశ్వరం వరకూ ముప్ఫైమైళ్లు పోతుంది. ఏ పొయ్యిల్లో ప్రయాణంచేసినా భయంలేని రస్తాకాబట్టి, రైలు దిగంగానే బండి కట్టుకుంటే కాకులు కూసేవేళకు అలాగ్గా ఇల్లు చేరుకోవచ్చుగదా అనుకొని సోమవారం రాత్రి బండికే వచ్చాడు వెంకటశాస్త్రి. కాని ఏ రైలుకు చూచినా కిలకిలమంటూ ఒంటెద్దుబళ్లవాళ్లు ప్రయాణీకుల కాళ్ల కడ్డంతగిలి చేతిలో మూటలు పెరుక్కొని పొయ్యే సమ్మర్దం గల ఆస్టేషన్‌దగ్గర ఆ రాత్రి వెంకటశాస్త్రికి ఒక్క ఒంటెద్దుబండి అయినా కంటిలో కలికానికికూడా కనుపించలేదు.

రాత్రి పదకొండున్నరా, రమారమి పావు తక్కువ పన్నెండూ కావొచ్చింది. వెంకటశాస్త్రి దిగినరైలు కూతేసి వెళ్లిపోయి చాలాసేపయింది. తనతో కూడా దిగిన జనం ఎట్లా వెళ్లారో ఎవరిదారిన వారు వెళ్లారు. రాత్రిడ్యూటీచేసే రైలుఉద్యోగి గేటుతలుపు బిగించి, పోర్టరూ తనూ అప్పుడే చెరొక బెంచీమీదా నడుములు వాల్చారు. స్టేషన్ నిశ్శబ్దంగా ఉంది. పైన వ్రేలాడకట్టిన లాంతరుదీపం తగ్గింపబడి, మినుకు మినుకుమంటూ ఉంది. స్టేషన్ మెట్లుదిగి పడమటగా ఉన్న మైదానంవైపు వెంకటశాస్త్రి పరకాయించి చూచాడు. ఆ ప్రదేశం అంతా నిరామయంగా ఉంది. తాను రెండేళ్లక్రిందట చూచినస్థలంతో పోల్చుకొంటే ఇప్పటి ప్రదేశం పాడుపెట్టిన ఇల్లువలె కళాహీనమై కన్పట్టింది. శుద్ధపంచమీనెల కాబట్టి చాలా లేతవయస్సులోనే దానికి కాలంగడిచిపోయింది. వెంటనే చీకటి విజృంభించి అలుముకొంది. మాఘమాసం. మంచుకురుస్తోంది. చలి దవడలు నొక్కేస్తూవుంది. బిగబట్టినచేతిపిడికిళ్లు విప్పితే శరీరం యావత్తూ పీక్కొని తినేటట్టుగా ఉంది చలి. వెంకటశాస్త్రిని అంత ముసలి వయస్సు కాకపోయినా, ఏభయిదాటి అరవైలో పడ్డఘటం. అందువల్ల అంత తీవ్రమైన చలికిగాని, ఎండకుగాని పూర్వంలాగా ఓర్చుకోలేకపోతున్నాడు. ఏమయినప్పటికీ, తెల్లారకుండా ఆ పద్ధెనిమిదిమైళ్లు ప్రయాణం చేసితీరాలె, విధిలేదు. వెంటనే బయల్దేరితేనేగాని అనుకొన్న ప్రకారం ఇంటికి చేరుకోలేడు. ముహూర్తానికి ముందుగా అందకపోతే చేసిన ప్రయత్నం వృథా అయిపోవడమే కాకుండా తాను రానందుకు ఇంటిదగ్గర ఖంగారు పడతారేమో! బాడుగబండ్లను నమ్ముకొని ప్రయాణం చేశాడు. తాను ఇల్లువిడిచిన ఈ రెండేళ్లకాలం కాలపురుషుడు కలుగచేసినమార్పు లాయనకేం తెలియగలవు? "స్టేషన్‌కు ఇంటిదగ్గరనుంచి బండిని పంపవలసిందని అబ్బాయికి జాబువ్రాసినా బాగుండిపొయ్యేది. ఎంత పొరపాటు పడ్డాను" అని తనలో తానే పస్తాయించుకొన్నాడు. కొంతసేపటికి, అసలు ఆ స్టేషన్ పుంజూరు స్టేషనేనా అని ఆయన కనుమానం వేసింది. ప్లాటుఫారంమీదకి వెళ్లి చెక్కమీది అక్షరాలు చదువుకొన్నాడు. "పుంజూరు" అని ఆయనకళ్లకు కనిపించింది: మనిషికి అనుమానం తీరింది; కొంత ధైర్యం కలిగింది.

కాని ఏంలాభం! ప్రయాణం సాగేఎత్తు కనపడడం లేదు. ఒక్కబండి అయినా లేకుండా ఇంతశూన్యం

కావడానికి కారణమాయనకు గోచరించడంలేదు. ఎవరినైనా అడిగి తెలుసుకొందామనుకొన్నాడు. కాని ఎక్కడా మనిషిసంచారం లేదు. సర్వమూ నిశ్శబ్దంగా ఉంది. కీచురాళ్ల కీచుకీచుకూతలూ, ఎక్కడనో దూరంగా మొరిగే కుక్కల అరుపులూ, కప్పల బెకబెకలూ తప్ప మరొకధ్వని శాస్త్రి చెవికి సోకడంలేదు. పోనీ, గ్రామంలోకి పోయి బండ్లకొరకు విచారిద్దామా అనుకొన్నాడు. కాని ఒక మైలుపోతేనేగాని ఊరు కనపడదు. ఆ అంధకారంలో, ఆ చలిలో, ఆ మూట భుజానవేసుకొని అంతదూరం పోలేక పోయాడు. ఆయన కేమీ పాలుపోకుండా ఉంది. ఏమీతోచక - మంచులో తిరిగితే రాత్రి నిద్రలేక జలుబు భారం చేస్తుందేమోనని - బయట మైదానంలో తిరిగే మనిషి, స్టేషన్ హాల్లోకి పోదామని వెనక్కి తిరిగి, నాలుగడుగులు వేశాడు. ఇంతలో పడమటితట్టునుండి ఏదో ఒకబండి వస్తున్నట్టు చప్పుడయింది. శాస్త్రి తటాలున వెనక్కి తిరిగి చూశాడు. ఒంటెద్దుబండి ఒకటి వచ్చి ఆతట్టు ఎడంగా ఉన్న ఒక వేపచెట్టుక్రిందికి పోయి నిలిచింది. వెంకటశాస్త్రికి కొంత ఆశ కలిగింది. పరవాలేదనుకొన్నాడు. వడివడిగా పదిబారలదూరం అడుగువేసుకొంటూ పొయ్యేవరకు, బండివాడు ఎద్దులను విప్పి, కాడి క్రిందపెట్టి, చాపక్రిందిగడ్డితీసి అప్పుడే ఎద్దు ముందర వేశాడు. గడ్డి తినడానికిగాను, బయట నిలబడిన ఎద్దు నగలదొడ్డిలో ఒకకాలు ముందుకు వేసి, మెడకింద పొట్టక్రిందా పుటుకుపుటుకున కుట్టే జోరీగలను మూతితోనూ, చెవులతోనూ, తోకతోనూ తోలుకుంటూ, ఇంకా గడ్డిలో మూతిపెట్టకుండానే నిలబడి ఉన్నది. పండుకొని నిద్రపోదామని బండివాడు ఈతాకులచాపను బయటికి తీయబోతూ ఉన్న సమయంలో వెంకటశాస్త్రి వెళ్లి

"అబ్బీ! విశలాపురానికి బండికడతావా?" అని అడిగాడు.

"విశలాపురమూ లేదు, గిశలాపురమూ లేదు. వెళ్లవయ్యా!" అన్నాడు బండివాడు.

"బాబుకదూ! నా తండ్రికదూ! నేను చాలా తొందరగా పోవాలె. ఇప్పుడు ఎకాఎకిని పోకుంటే నాకు చాలా తొందరపనులు చెడిపోతవి. నాకోసరం కాస్త కష్టపడుదూ నాయనా! పెద్దవాణ్ణి! బహుమంచివాడివి" అని ప్రాధేయపడ్డాడు శాస్త్రి.

"నాకు నిద్రొస్తోంది తాళవయ్యా! పండుకోవాలె" అని బండివాడు చాప నేలమీద పరిచాడు. నిద్రబద్ధకంతో సుకురావడంచేత చాపమీద నడుంవాల్చాడు ఇక ఆ బ్రాహ్మణుడు బండి కట్టమని 'బాబుకాదూ, నాయనకాదూ' అని ఒకటే బ్రతిమాలడం మొదలుపెట్టాడు. బండివాడు కట్టలేనని విసుక్కోవడమూ, బ్రాహ్మణుడు బ్రతిమాలడమూను. చివరకిది పని కాదని

"ఇదుగో చూడు. నువ్వుకోరినంత బాడుగిస్తాను. రూపాయిన్నర ఇస్తాను తీసుకో; లే! ఎక్కడా బండి చిక్కలేదు నాకు. గిరాకీగా ఉంది: పోగొట్టుకోబోకు" అని ఆశపెట్టాడు శాస్త్రి.

"ధనమూల మిదం జగత్" కదా! మామూలు బాడుగకంటె అర్ధరూపాయి అధికంగా వచ్చేపాగీ కనపడేవరకు బండివాడికి ఆశపుట్టింది. వెంటనే వాడు చాప చుట్టి బండిలోవేసి,

"ఎంతమంది మనుష్యు"లని అడిగాడు.

"నేనొక్కణ్ణే" అన్నాడు శాస్త్రి.

బండివాడు ఎద్దుముందరవేసిన గడ్డిని బండిలో చాపకింద తురిమి, నగఎత్తి, ఎద్దును అంకెకు తెచ్చుకొని, కాడి అగ్రుమీదపెట్టి, మెడపలుపు బిగించాడు. వెంకటశాస్త్రి జారీచెంబు చేత్తో తీసుకొని, కాలు ముడిచి అనుమానం తీర్చుకొని, ప్రక్షాళన అయినతర్వాత మూటతెచ్చి బండిలో పెట్టాడు. కాలిచెప్పులు చాపకింద భద్రపరచి, "పట్టుకో" అని బండివాణ్ణి హెచ్చరించి, "రామయ్యతండ్రీ" అంటూ బండిలో ఎక్కి కూర్చున్నాడు. పదిగజాలదూరం రోడ్డు ఎక్కేవరకూ బండివాడు నగ పట్టుకొనే నడిపించి, రోడ్డెక్కిన తర్వాత పగ్గం బండివెదురుదబ్బలకు కట్టి, నగలో ఎక్కి కూర్చు

న్నాడు. వాడు కొరడాకోసం ఇంకా తడువుల్లాడుకొంటూ ఉండంగనే ఎద్దు మెల్లగా పరుగందుకొన్నది.

రాత్రి చాలా పొద్దుపోయింది. ఒంటిగంట కావచ్చింది. రెండురోజులుగా ప్రయాణం బడలికచేత పాపం బ్రాహ్మడు డస్సిపోయాడు. కాస్త కన్ను కూరుకుదామనుకొని, నడుము వాల్చి తలకిందికి మూట లాక్కున్నాడు. "వెనకబరువు సామీ" అని బండివాడు హెచ్చరించేవరకు మూటతోసహా తాను ముందుకు జరిగాడు. మూటా, మూటమీద పెట్టుకొన్న తనతలా, బండివాని పృష్ఠానికి వెళ్లి తగులుకున్నవి. "రవంత వెనక్కు అనండి. ముందు బరువయిం" దన్నాడు బండివాడు. బండివాని సహాయంతో మూట కొంచెం వెనక్కు లాక్కొని, బండివాడు "ఆ" అన్నతర్వాత, శాస్త్రి కాశ్మీరశాలువ కప్పుకొని, ముసుగుతన్ని, కాళ్లు ముడుచుకొని, ఒత్తిగిలి మూడో అంకె వేసి పండుకొన్నాడు.

బండి రెండుమైళ్లు సాగిపోయింది. ఆ బండి వట్టి పాతతుక్కు; ఎప్పటిదో ఇక్ష్వాకులనాటిది. అందులో అడ్డబండి. బాడుగ బళ్లవాళ్లకు కమానుబళ్లెక్కణ్ణుంచి వస్తాయి? పైన గూడుకు వేసిన ఈ తాటాకులచాప చాలాభాగం శిథిలమై, బండిలో పండుకొని పైకిచూస్తే ఆకాశంలో నక్షత్రాలు అగుపడుతూ ఉన్నవి. బండి చక్రాలకు వేసిన సామాను కులంగలకొయ్య కానందువల్ల, చలికి బిర్రబిగిసి, ఆకులూ, పూటీలూ వంకలపోయి, ఎగుడుదిగుడుగా బండికి దొడ్డి ఏర్పడింది. కుండల్లోని ఉలవాయిలూ, ఇరుసుకడలూ అరిగిపోయి, కుండ తూముల్లో సందు ఏర్పడి, వదులువల్ల కుండలు రెండూ ఆపక్కకీ, ఈపక్కకీ జరిగి కడసీలలకు టక్కుటక్కుమని తట్టుకొంటూ ఉన్నవి. ఆ తట్టుకోవడంలో అసలే దొడ్డిచక్రాలయినందువల్ల బండిచట్టం యావత్తూ ఆపక్కనుంచి ఈపక్కకీ, ఈ పక్కనుంచి ఆపక్కకీ ఊపు ఇస్తోంది. అందులో గతుకులున్నచోట, చక్రం పల్లానికి దిగి మిర్రుకెక్కడంలో, ఎద్దుమెడమీదఉన్న కాడితో సహా బండి అడ్డంగా ఉయ్యాలలూగుతోంది. ఈఎగుడు దిగుడు ఉయ్యాలలో వెంకటశాస్త్రి కళేబరంకూడా ఊగిసలాడుతూ, ఒకపక్కకి ఒత్తిగిలి పండుకొన్నందువల్ల, బండి వెనక్కు మీటినపుడు వెన్నెముకకూ, ముందుకి మీటినపుడు మోకాళ్లచిప్పలకీ బండి వాసికొయ్యలూ, పెండెందబ్బలూ కొట్టుకొని బొమికమీద దెబ్బ తగిలేవరకు - పాపం - ఆ బ్రాహ్మడికి ప్రాణం జిల్లార్చుకొనిపోతోంది. కుడిచెయ్యి తలకింద ఉండడంవల్ల, దెబ్బ తగిలినపుడల్లా "ఇస్సు: అబ్బా!" అని ఆయన ఎడంచేత్తో ఆ స్థలంలో రుద్దుకొంటున్నాడు. కంటిమీద కును కెటువంటిదో ఎరుగడు ఆ మానవుడు. ఇన్నాళ్లుగా ఇంతదేశం తిరిగాడుకాని, ఇట్లాంటి ఉతుకష్టపు ప్రయాణసౌఖ్యం ఆయనకెక్కడా లభ్యపడలేదు. ఇక నిద్ర ఎట్లాపట్టుతుం దాయనకు? నిద్రపట్టడం మాట ఎట్లాఉన్నా, మోకాళ్లచిప్పలు బద్దలయ్యేబాధ భరించలేక, కాళ్లు ముడుచుకొన్న మనిషి వెల్లకిలా పొర్లి "శంకరా, మహాదేవా" అంటూ కాళ్లురెండూ చక్కగా చాచుకొన్నాడు. అట్లాకూడా ఆయనకు ఉసి చిక్కలేదు. బండిచట్టం పొడుగు మట్టమైనందున, చాచిన రెండు కాళ్లూ మోకాలికింది పిక్కలలగాయతు పాదాలవరకూ చట్టానికి వెలుపలగా వచ్చినై. దానికితోడు బండిఇచ్చే ఒక్కొక్క ఊపుతో ఒక్కొక్క అడుగు కిందికి జారిపోతూ వచ్చింది ఘటం. ఆ జారిపోవడంలో, తలకింద మూటకీ మూటమీది తలకాయకీ సంబంధం విడిపోయి, రెండూ వేరయిపోతున్నవి. ఇంతలో కాడి పైకి లేచి ఎద్దుకి మెడపలుపు బిర్రుతగిలేవరకు "వెనక బరువు సామీ, వెనక బరువ"ని బండివాడు మళ్లా హెచ్చరించాడు. "నీ పోడేమిటిరా చచ్చిపోతుంటే" అని శాస్త్రి మూట విడిచి తలకాయ కిందికి జరగకుండా ఉండేటట్టు ఇరుపార్శ్వములా ఉన్న పెండెంకొయ్యల్ని చెరొకచేత్తోనూ గట్టిగా పట్టుకొని, బండిచట్టానికి చివరభాగంలో బిగించిన అడ్డకొయ్యకు కాలి మడిమెలు తన్నిపట్టి, మనిషి బిర్రబిగిసి పైకి ఎగతన్ని పండుకొన్నాడు. ఈ వాటంలో పండుకొనేవరకు మనిషి కిందికి జారిపోవడం నిలిచిపోయింది. కాని నిద్రపోవడానికి సావకాశం చిక్కలేదు. ఆయన చేతులూ,

కాళ్లూ, శరీరం యావత్తూ జారిపోకుండా బండిలో నిలబెట్టుకొనే ప్రయత్నంలోనే ఉండవలసివచ్చె! ఏమాత్రం పట్టువదిలినా వాటంచెడి మనిషి కింద పడి పొయ్యేటట్టుగా ఉండె! ఇక ఆయన నిద్రపొయ్యే దెప్పుడూ?

ఎద్దుకూడా బండికి తగినట్టుగానే ఉంది. ఆబండి వాడు, దాని మొఖాన్న ఎన్నడూ ఇంత పచ్చిగడ్డికాని, ఇంత నున్నపొట్టుకాని కొట్టిన పాపాన్ని పోలేదు. కొరడాకొయ్యతో కొట్టేవరకు, శరీరంలో చర్మంతప్ప కండ లేనందువల్ల, ఎముకలకు తగిలి, కొయ్యమీద కొయ్యతో కొట్టినట్లు చప్పుడవుతున్నది. కడుపులోకి తాగిననీళ్లుతప్ప మరొకబలమైన ఆహారం లేనందువల్ల ఎద్దు లసువ్రతీసినపుడల్లా, కడుపులో పేగులు అదిరి ఎద్దు పారుకొంటూ వచ్చింది. ఆ సమయంలో పేడచినుకులు మధ్యమధ్య వెంకటశాస్త్రి నెత్తిమీదా, మొఖంమీదా పడి ఆయనగారి ఉత్తమాంగము పవిత్రమవుతూ వచ్చింది. వాసన భరించలేక గుడ్డతీసుకొని ముక్కు కడ్డు పెట్టుకొంటూ, మధ్యమధ్య మొఖం తుడుచుకొంటూ - పండుకొన్నమనిషి లేచి కూర్చుని, ఆగ్రహపూరితుడై,

"అబ్బబ్బ! ఏంబండిరా, ఈబండీ! నాప్రాణాలు తీయడానికి వచ్చింది. ఛీ! ఛీ! దీన్ని అగ్గిపుల్ల వెలిగించి మంటపెట్టితే పీడ వదిలిపోను." అని పెద్దంగా అరిచాడు.

బండివాడికి నవ్వొచ్చింది.

"నా బండి కేంతక్కువ సామీ!" అని అడిగాడు.

"నా శ్రాద్ధం, నా పిండాకూడూను. శరీరం నఖశిఖ పర్యంతమూ హూనమైపోతోంది."

"బండి బాడుగలన్నీ పోయినవయ్యె. వాడడంలేక, బాడుగరాక పరమ్మతు లేకపోయె. ఏంచేయమంటారు సామీ!"

"ఇంతదేశం తిరిగాను కడుపులో నీళ్లు కదలకుండా. ఏ రోడ్డుబట్టినా మోటార్లమయమై పోతుంటే, ఈ దిక్కుమాలిన రోడ్డుమీద మోటారే పడదు. ఛీ! ఛీ! వెధవప్రయాణం. ఎరక్కపోయి ఎక్కాను నీ ముతనష్టపుబండి" అని శాస్త్రి విసుక్కొన్నాడు.

"లేకేమి సామీ! ఎదు రొకటీ, వా లొకటీ - రెండు మోటార్లుండై ఈరోడ్డుమీద."

"అయితే నా కాసంగతి మొదట్లోనే చెప్పావు కాదేం?"

"తెల్లవారి పదకొండుగంటలబండి చూచుకొని గాని తూర్పు కెళ్లేమోటారు బయల్దేరదు. తెల్లవారకుండనే ఇల్లు చేరుకోవాలన్నారుగా తమరు?"

"రాత్రికూడా ఒక మోటారు తగలబెట్టకూడదూ - ఆ మోటారువాళ్లు?"

"వాళ్లకేం మారాజులు. బాడుగబండివాడనే పురుగు లేకుండా - ఉన్నవాళ్ల నందర్నీ జైలు కేసిన తర్వాత - ఇక పగలూ తిప్పతాడు, రాత్రిళ్లూ తిప్పతాడు ఆమారాజు."

"బాడుగబళ్లవా ళ్లేమిటి? జైల్లో వేయించడమేమిటి?"

"ఆకథ అంతా శానా ఉండదిలెండి. చెప్పకొంటే తీరేమంట కాదు" అని బండివాడు, టుర్రుమని ఎద్దును అదిలించాడు. ఎద్దు దవుడుతీసింది.

"ఎవరు వేయించారు ఈరోడ్డుమీద మోటార్లు?"

"ఉన్నాడులెండి ఒకపుణ్యాత్ముడు. మాప్రాణాలకు శనేశ్వరుడై పట్టి పీక్కొనితింటున్నాడు."

"ఆయన పేరు?"

"చెంచునాయుడట."

"ఏ చెంచునాయుడు?"

"బోళ్ల చెంచునాయుడు."

"ఏవూరు?"

"గంగపట్నం ఆయనగారిది."

గంగపట్నానికీ విశలాపురానికీ ఒకమైలుదూరం. విశలాపురం గంగపట్నం మజరాగ్రామమే. చెంచు

నాయుడుకీ, వెంకటశాస్త్రికీ ప్రాణస్నేహం. చెంచు నాయుడు, మోటారు, బళ్లవాళ్లు, జైలు - ఈమాటలు చెవినిపడేవరకు తన స్నేహితుడు చెంచునాయుడి కేదో ఆపద కలిగి ఉంటుందని శాస్త్రికి కొంత ఆందోళన కలిగింది. తాను కొత్తమనిషివలె నటించి, అచ్చటి విశేషాలేమో బండివానివల్ల తెలుసుకొందామని శాస్త్రి కొక ఆలోచన పుట్టి—

"అయితే ఎన్నాళ్లయిం దీరోడ్డుమీద మోటార్లు వచ్చి" అని బండివాణ్ణి అడిగాడు.

"అంతా ఒక సంవత్సరం అయింది. మీదేవూరు సామీ?" అని బండివాడు ప్రశ్నించాడు.

"మాది దక్షిణాది. విఠలాపురంలో బంధువు లుంటే చూడడానికి పోతున్నా."

బండివాడు పలక్కుండా బండి తోలుతున్నాడు కాని వాడు ఊరుకోవడం శాస్త్రికి హితవుగా లేదు. వాణ్ణి కదిలించి ఇంకా విశేషాలు ఒక్కొక్కటే బయటికి తీయాలని ఆయనకు ఆత్రంగా ఉంది.

"బళ్లవాళ్లను జైల్లో ఎందుకు పెట్టార్రా అబ్బీ."

"ఈరోడ్డుకు మోటార్లు వచ్చినప్పటినుంచీ బళ్లవాళ్లకు కూడు పడిపోయింది. ఆ మారాజు, ఒంటెద్దు బళ్లవాళ్లతో పోటీచేసి, వీళ్లు అర్ధరూపాయికి తీసుకొని పోతామంటే, వాళ్లు అరణాలకే తీసుకొనిపోతామనీ, వీళ్లు అరణాలంటే వాళ్లు పావులాఅనీ, వీళ్లు పావులా అంటే, వాళ్లు బేడనీ- ఇట్లా పంతానికి పోటీచేసి ఒక్క పురుగయినా బళ్లవాళ్లకు చిక్కకుండా చేశారామోటారువాళ్లు"

"అందుకని ఇద్దరూ కలియబడి కొట్టుకొన్నారా ఏమిటి?"

"కొట్టుకోనూ లేదు, తిట్టుకోనూ లేదు: బలవంతులమీదికి కూటికిలేని కుంకలు పోగలరా? సంసారాలకు జీవనోపాధి పడిపోయి, బళ్లమీద చిన్నడబ్బు రాకుండా పొయ్యేవరకు, బళ్లవాళ్లకే బళ్లను ఆధారంచేసుకొని బతికే అలగాజనానికీ కడుపు మండి, అంతా నూరుమంది తోడయి ఒకరోజు కుమ్మక్కుగా నాయుడి లోగిలిమీద పడి ఆయనగారి ధాన్యపుకొట్ల తాళాలు పగలకొట్టి, తలా పందుం, ఏదుంగింజలు పట్టపగలు దోచుకొన్నారు."

"అయ్యో!"

"అయ్యో లేదు, కొయ్యో లేదు. మరి ఎన్నాళ్లని కడుపుమంట భరించగలరు చెప్పండి సామీ! ఇంట్లో గడవక బళ్లనీ ఎద్దుల్నీ కూడా అయినకాడికి తెగనమ్ముకో వలసివచ్చె. అందులో ఆగంగపట్నం బళ్లవాళ్లందరూ తురక సాహెబులు సంసారపోషణ యావత్తూ మొగవాడి రెక్కమీదనే జరగాలె. కూలిచేసుకొని బతుకుదామనుకొంటే, వాళ్లకులంలో ఆడది బయటికి రావడానికి వీల్లేకపోయె. చస్తారా! ఆఖరికి ఆ తురకలే ఇంత ప్రయత్నం చేసి, ఇతరకులాలవాళ్లనికూడా చేర్చుకొని, ఇంతపని చేశారు."

"ఇంకా ఇతరకులాలవాళ్లంటే ఎవరు?"

"అబ్బో. ఈ మోటారు వచ్చినతర్వాత ఎంతమందికి కూడు పడిపోయింది సామీ! బళ్లుచేసే వడ్రంగులకీ, ఎద్దుల బేరగాళ్లకీ, బండికొయ్యలు అమ్ముకొనే వాళ్లకి, బండిగూడు కొట్టేమేదరోళ్లకీ, ఆఖరికి ఎద్దుకి పచ్చిగడ్డి దొక్కొని రోజుకో అణాడబ్బులు తెచ్చుకొనే మాలమాదిగముండలకీ - ఇంతమందికి కూడు లేకుండాపోయింది సామీ! ఆ తురకసాహెబులే గంగపట్నంలో ఇంతమందినీ కలుపుకొన్నారంట: అబ్బ! వాళ్లు తలుచుకొంటే ఎంతపనైనా చేస్తారు సామీ!"

"మంచిపని చేశారు. తగినశాస్తి అయిందన్నమాట!"

"ఏమయిందో. ఏమయి ఏం ఉపయోగం చెప్పండీ! బలవంతుడిదే రాజ్యం ఈకాలంలో."

"అట్లాగే."

"ఈ వందమందిమీదా కేసుపెట్టి, ఆఖరికి తలా ఒకటీ, రెండూ, మూడేసేళ్లు శిక్షవేయించి, జైలుకు పంపేవరకూ ఆ నాయుడూ, ఆ పోలీసుల్లూ నిద్రపోలేదు

గదా! కానియ్యండి భగవంతు డన్నీ కనిపిస్తాడు" అంటూ బుగ్గనఉన్న పొగాకు తుపుక్కున ఊసి ద్రుచ్చి అని ఎద్దును అదిలించాడు.

చివరకి చెంచునాయుడిదే పైచెయ్యి అయిందని వినేవరకు శాస్త్రి మనస్సుకు ఊరట కలిగింది. బళ్ళ వాళ్ళకీ, నాయుడుకీ, ఏదో పెద్ద వ్యవహారమే జరిగి ఉంటుందని ఊహించాడు. నాయుడు పట్టుదలమనిషని శాస్త్రికి బాగా తెలుసు. ఇంకా విశేషాలు ఏమిటో విందామని -

"అబ్బా! ఎంతకథ జరిగిందిరా అబ్బీ! ఎన్నాళ్ళయింది ఇదంతా జరిగి?"

"కేసు జరిగి ఆరునెల్లయింది. ఈ ఆరునెలలుగా విచారణలో ఉండి, అంతా వారంరోజుల కిందటనే జడ్జిగారు శిక్ష చెప్పారు."

"ఆ నాయుడు బాగున్నాడా?"

"బాగుండక ఆయన కేంరోగం? బీదవాళ్ళని ఏడిపించడానికి ఇంకా నూరేళ్లు బతుకుతా డాపుణ్యాత్ముడు."

"ఆయన దేనైనా పెద్దస్థితేనా ఏమిటి?"

"ఆయనకేం సామీ జమీందారు: గంగపట్నం సగం పూరంతా కొన్నాడంట. ఇంకా ఎన్నెన్నో ఆయనకు వ్యాపారా లుండై. సాలుకు ఇరవై వేలు వస్తుందని అంటారు"

"అబ్బా! ఇంతడబ్బుగలవారు మోటార్లు వేసి బీదవాళ్ళని ఏడ్పించకపోతేనేం పాపం."

"ప్రజల సౌకర్యంకోసరం వేయించాడంట ఈ మోటార్లు. ప్రజ లెవరో, సౌకర్యా లేమిటో ఆయన కసలు తెలుసా?"

"ఎంతసేపూ స్వలాభంకోరకే ఈ దొర్లాట - భాగ్యవంతులకు కూడా."

"పోనీ కేసు పెట్టితే పెట్టాడ డనుకోండి. పచ్చి గడ్డిగంప లమ్ముకొనే మాలముండల్ని కూడా ఇరికించాలా ఆదొరకి? అయినా మాకులం అంటే ప్రతీవాడికీ అలుసు సామీ" అని అన్నాడు బండివాడు.

బండివాడు "మాకులం" అనేవరకు శాస్త్రికి అర్థం కాలేదు. "మాలకులమనా లేక వాడికులమే మాలకులమనా దాని అర్థం అని సందేహం కలిగింది; శాస్త్రికి ఏదో ఆలోచనపడిందిమనస్సులో!

బండివాడు తనధోరణి తాను విడవలేదు. ఏదో పరధ్యానంగా ఉండి నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నాడు. తన బండిలోని మనిషి బ్రాహ్మడని వాడికి తెలియదు. తెలిసినప్పటికీ వాడు బ్రాహ్మలికికూడా ఇదివరలో చాలాసార్లు బండి కట్టాడు. మళ్లా అందిపుచ్చుకొని "మా మాలకులానికి కయ్యాలా, కొలవలా చెప్పండి సామీ! ఆముండలు బళ్ళవాళ్ళకి గడ్డి అమ్ముకొని బతుకుతున్నారని, దోపిడీ సమయంలో వాళ్లుకూడా గంపలు చేతపట్టుకొని ఆజనంలో ఉన్నారని పదిమంది ఆడవాళ్ళనుకూడా కేసులో ఇరికించాడు ఆనాయుడు. వాళ్లు పసిబిడ్డల తల్లులంట. ఇంటికాడ పిల్లలు అలో లక్షణా అని అల్లాడిపోతున్నారంట! తలుచుకొంటే, దుఃఖం వస్తుంది సామీ! అని బండివాడు ఆవుద్రేకం మీద ఏమేమో చెప్పబోతుండగా, వాడు మాలవాడని శాస్త్రికి స్పష్టమయింది. దానితో ఆయన ఒళ్లు జలదరించింది. బండిలో వక్కక్షణంకూడా నిలవలేక పోయాడు. దిగుతున్నానని చెప్పనైనా చెప్పకుండా, వెనక్కి జరిగి కిందికి గభాలున దూకాడు. చైతన్యం విడిచి రోడ్డుమీద కొయ్యబొమ్మవలె నిలబడ్డాడు. బండివాణ్ణి నమిలి మింగేయాలన్నంత ఆగ్రహం వచ్చిందాయనకు కాని కర్తవ్యం గోచరం కాలేదు. జీవితానికి పరమావధిగా పెట్టుకొని తాను ఇన్నేళ్లుగా చేసినకృషి అంతా గంగపాలయిపోయింది. కాశీగంగిచెంబులు బండిలో ఉన్నై. సర్వం జగన్నాథం అయింది. వెళ్లి బండివాడితల రెండు చెక్కలయ్యేటట్టు పగలకొట్టా లనుకొన్నాడు: కాని ధైర్యంచాల్లేదు: చీకటి, అంధకారం. తాను ఒంటరిగాడు: రెండో సహాయం లేదు: బండివాడు ఇరవై, ఇరవై అయిదేళ్లు వయస్సుగలిగి, మంచి జబ్బ పుష్టిగల మనిషిలా ఉన్నాడు: తిరగబడితే తనవంటి పప్

బ్రాహ్మలను పదిమందిని కలిపికొట్టేవాడులా కనపడ్డాడు. ఆపరిస్థితులలో తొందరపడకూడ దనుకొన్నాడు. ఊరికి చేరినతర్వాత వాడిభరతం పట్టాలని తీర్మానించుకొన్నాడు. వెళ్లిమళ్లా బండెక్కి కూర్చున్నాడు. బండివాడి కొనుక్కొని ఉన్న తనమూటను ఎడంగా లాక్కొన్నాడు. బండి సాగింది. ఇక బండివాడి పుట్టుపూర్వోత్తరాలు తెలుసుకోవాలనని శాస్త్రి -

"అబ్బీ! నీ దేవూరురా?" అని అడిగాడు.

"నాది ఉత్తరాది- తెనాలండి."

"ఇక్కడ కెందు కొచ్చావు?"

"పుంజూరులో నా మేనమామకూతుర్ని పెళ్లిచేసుకొని ఇప్పటి కారునెలలుగా ఇక్కడే నిలిచిపోయాను. ఈబండి మామామదేనండి."

"నీపేరు?"

"పోలయ్య"

"గంగపట్నం బళ్లవాళ్లను నువ్వెరుగుదువా?"

"కొంతమంది గుర్తేనండి."

"నువ్వు మాలవాడివికదా ? నీబండికి జనం దొరుకుతున్నారా?"

"ఇప్పు డెవరూ ఆపట్టింపులు పెట్టుకోవడం లేదండి. అవసరంకొద్దీ అయ్యగార్లుకూడా నాబండి చాలాసార్లు కట్టించుకొన్నారు."

"ఇదివర కెప్పుడైనా విశలాపురం వెళ్లావా?"

"విశలాపురం పోలేదుకాని, గంగపట్నం వెళ్లాను."

"ఆవూళ్లో నీకు బంధువు లున్నారా?"

"లేరండి."

"సరే! తొందరగా పోనియ్యి! తెల్లవారవస్తోంది." అన్నాడు వెంకటశాస్త్రి.

తెల్లవారుజామున ఇంకా కనిచీకటి ఉంది. ఇంకా అయిదారుమైళ్లు పోవాలి బండి. వెంకటశాస్త్రికి స్థిమితం చెడింది. తనంతటిపండితుడు చివరికి మాలవాడిచేతిలో చిక్కుకొన్నందుకు ఆయనకు పట్టరాని ఆగ్రహం కలుగుతూవుంది. అగ్రజన్మయెత్తిన తనయెడల అంత అపచారంచేసిన ఒక తక్కువకులం మాలవాణ్ణి ఆసమయంలో తా నేమీచేయలేని నిస్సహాయస్థితికి ఉడుకుమోతుతనం ఉబికిఉబికి పొర్లివస్తోంది. హృదయం కుమిలి వేడినిట్టూర్పు లధికమైనవి. బండివానిమీద కలిగిన ఆగ్రహాగ్నికి శరీరం యావత్తూ వేడెక్కి, మాఘమాసంచలి మందగించి, కప్పుకొన్న శాలువ వంటిమీద ఉంచుకోవడానికి ఆయనకు చీకాకనిపించింది. శాలువ విసరి బండిలో ఓపక్కన వేశాడు. ఎప్పుడెప్పుడు ఇంటికి చేరుదామాఅని ఆత్రపడుతున్నాడు ఆబ్రాహ్మడు.

ఉదయం అయినూఅయిదున్న రయ్యేసరికి బండి కంకరరోడ్డు దిగి మట్టిరోడ్డుకు మళ్లింది. బాగా తూర్పురేఖ లారినవి. బండివాడిముఖం శాస్త్రికి బాగా గోచరించింది. ఉదయాన్నే ఛండాలుడిముఖం చూడడాని కసహ్యం అనిపించింది. ఆసంధ్యవెలుతురులో శాస్త్రిముఖంకూడా పోలయ్యకు పొడకట్టింది. ఆయన బ్రాహ్మణుడుకాబో లనుకొన్నా డతడు; కాని ఆయనముఖంలో వికాసం కనిపించలేదు. మరి షేదో దీర్ఘాలోచనలో ఉన్నట్టుగా అగుపడ్డాడు. మొఖం ఎర్రంగా జేవురించి, నరాలతోకూడా ఉబికిఉంది. కళ్లురెండూ చింతనిప్పులవలె కణకణ లాడుతూ ఉన్నై. రాత్రి నిద్రలేక ఆయనముఖం అట్లా ఉం దనుకొన్నాడు బండివాడు.

ఆరుగంట లయ్యేవరకు బండి విశలాపురంచేరి వెంకటశాస్త్రి ఇంటిముందట నిలిచింది. ఆరోజు మనుమడి భారసాల. వీధిగుమ్మానికి మామిడాకులతోరణం కట్టారు. శాస్త్రి ఎప్పుడు వస్తాడా అని ఇంటిల్లిపాదీ కోడికూతతో లేచి ఎదురుతెన్నులు చూస్తున్నారు. వెంకటశాస్త్రి బండి దిగి మూట వీధిఅరుగుమీద పెట్టి బయటనే నిలబడ్డాడు. కాళ్లు కడుగుకోను భార్య నీళ్లు తెచ్చియిచ్చింది. మొఖం కడుక్కొను పళ్ల తెమ్మన్నాడు శాస్త్రి. ముఖమార్జనం అయింది. శాస్త్రి

ఇంట్లో అడుగుపెట్టలేదు. "లోపలకు రం" డని భార్యా, కొడుకూ పిలిచారు. "ప్రయాణపుగుడ్డలు లోపల పెట్టడానికి వీల్లేదు. స్నానం చేసిగాని లోపలకు రా నన్నాడు" శాస్త్రి.

బండివాడు "బాడుగ స్వామీ" అని అడిగాడు. "ఇస్తాను ఉండరా" అని వాడికి జవాబు చెపుతూ, కొడుకును రహస్యంగా పిలిచి, అర్జంటుగా చెంచు నాయుణ్ణి పిలుచుకొనిరమ్మని పంపాడు.

చెంచునాయుడికి వెంకటశాస్త్రి గురుపదం. పండితుడన్న గౌరవంచేత, ఆయనకు నాయుడు ఇల్లు కట్టించి యిచ్చాడు. నాలుగెకరాలమాగాణి వ్రాసి యిచ్చాడు. ఆయనకొడుకు వివాహానికి ద్రవ్యసహాయం చేశాడు. శాస్త్రిగారికుటుంబంమీద నాయుడి కెంతో ప్రీతీ, అభిమానమూను. ఈసంబంధం అనాదిగా పెద్దల తాగాయతూ వస్తూఉన్నది. అందువల్ల తనకు పని ఉన్నా, శాస్త్రికి పని ఉన్నా, ఏ వేళ నైనా సరే నాయుడే శాస్త్రిగారిదగ్గరకు స్వయంగా వచ్చి మాట్లాడి పొయ్యే మామూలు. అందువల్ల ఆయనదగ్గరనుండి కబురు వచ్చింపనేవరకు, రెండేళ్లుగా దేశాటనంచేసి వచ్చినందున ఏమి తొందరపనో అని నాయుడు నిద్రమంచంమీదనుంచి లేవడంతోనే తలకు ఫ్లానల్ గుడ్డ చుట్టుకొని, కాలికి చెప్పులు తొడుక్కొని, చేత కర్ర పట్టుకొని, ఎకాఎకీని విఠలాపురం బయల్దేరాడు.

అప్పటికప్పుడే సూర్యోదయం అయి బారెడుపొద్దెక్కింది. అగ్రహారీకులు "చాలాకాలానికి దయ చేశారు శాస్త్రిగారు" అని కొందరూ, "అగ్రహారంమీద శాస్త్రిగారు మరీశీతకన్నేశారు" అని మరికొందరూ, "మమ్మల్ని మరిచేపోయారు — శాస్త్రిగారు" అని ఇంకోకొందరూ, "బహుకాలదర్శనం — క్షేమమా?" అని మరికొంతమందీ—ఇట్లా అనేక రకాలుగా పలకరిస్తూ శాస్త్రిగారి ఇంటిముందర జనం మూగారు. ఇంతలో నాయుడు వచ్చి — "సాష్టాంగ దండాలు" అని శాస్త్రికి దణ్ణం పెట్టాడు.

"దీర్ఘాయుష్యమస్తు. వంశాభివృద్ధిరస్తు. ఐశ్వర్యాభివృద్ధిరస్తు" అని శాస్త్రి దీవించి, చాప తెప్పించి వీధి అరుగుమీద వేయించి నాయుణ్ణి కూర్చోమన్నాడు.

"చాలా కాలానికి మామీద దయ వచ్చిందే శాస్త్రిగారికి—"అని నాయుడు కుశలప్రశ్న చేసి ఏదో అనబోతూఉండగా లోపల కుతకుతలాడే శాస్త్రి ఇక భరించుకోలేక, వెంటనే.

"విన్నాను. కథ యావత్తూ విన్నాను. ఈతాగుబోతు లంజకొడుకులు నీకు చేసిన అపకారం అంతా చెవికొచ్చింది. అబ్బా! ఎంత గండం తప్పింది నాయుడూ! నీకు. నిష్కారణంగా వీళ్ల చేతుల్లో నీప్రాణాలు పోయిఉండేవి. ఎంతపని జరిగిందీ! ఇట్లా జరిగిందని నాకు ఒకకార్డుముక్కైనా రాశావుకావు, మావాడూ రాశాడు కాడు—"అని శాస్త్రి నాయుడికి కలిగినఆపదకు తన సానుభూతి చూపిస్తూ ఆదరణ మొదలు పెట్టాడు.

"మీకు వ్రాద్దా మనుకొంటూనే సుస్తీచేశాను. ఇంతకూ భగవంతుడు చల్లంగా చూడాలెకాని—వీళ్ల వల్ల ఏమవుతుందీ వెధవలు,"

"నిజమే! ఇంకా వీళ్లని ముక్కలుముక్కలుగా తరిగి ఉప్పుపాతర వేయకుండా ఊరుకొన్నావా నాయుడూ?"

"అయితే అంతపనీ చేయకుండా విడిచిపెట్టేనా ఏమిటి? ఒక్కొక్కడికి మూడేనేళ్లు వేయించి వంద మందినీ వెల్లూరుజైలుకు పంపించాను. తమరు వినలేదూ?"

"ఎంతచేసి ఏంఉపయోగం? మళ్లా కథఅంతా మొదటికొచ్చింది. విన్నావో లేదో! జమీందారు వంటివాడివి నిన్నే లెఖ్ఖచేయని ఈ గాడిదకొడుకులు మాబోటివాళ్ల నిలక్ష్యపెట్టుతారా? ఆసేతుహిమాచలపర్యంతమూ తిరిగివచ్చానుకాని ఇంతపరాభవం ఎక్కడా పొందలేదు."

"ఏంజరిగిం దేమిటి?"

"అదుగో చూడు! ఆబండిదగ్గర నిలబడ్డాడు వాడు శుద్ధమాలాడు. నిన్నగాక మొన్న నూరుమందికి శిక్ష వేయించావుకదా నువ్వు, వీడు భయభక్తులు లేకుండా నన్ను పుంజూరునుంచి విశాలాపురానికి బండిలో ఎక్కించుకొనివస్తాడా? వీణ్ణి ఏంచేస్తే పాపం ఉంది?"

"మాలవాడావీడు?"

బండివాడు పలక లేదు.

శాస్త్రి వాడికేసి చూస్తూ "ఛీ! జవాబు చెప్పకుండా నిలబడతావు. ఆనోటి మీద వాతలు వేయిస్తా చూడు! రాత్రి తెల్లవార్లూ, ఈనాయుణ్ని నోటికి వచ్చినట్లు దూషిస్తూ మాట్లాడేవే! ఇప్పుడేమైందిరా నోరు?"

"దవడపళ్లు రాలేటట్టు కొట్టక పోయినారా అట్లాంటికూతలు కూసినప్పుడూ? ఈ వొంటెద్దుబళ్ల వాళ్లని ఏంచేసినా పాపం లేదు" అన్నాడు నాయుడు.

బండివాడు గడగడ వణికిపోతున్నాడు.

"నేనెవరని నీబండిలో ఎక్కించుకువచ్చావురా నువ్వు? మాదిగవాణ్ణనుకొన్నావా? మాలవాణ్ణనుకొన్నావా? మనిషిని గమనించి మరీ బండికట్టపనిలే?"

"నాకేం తెలుసు సామీ! తమరు బ్రాహ్మనలనీ?" అన్నాడు బండివాడు.

"అయితే బ్రాహ్మడెవడో మాలవాడెవడో కూడా తెలియకుండా కళ్లకు కావరం ఎక్కి ఉన్నావన్నమాట" అన్నాడు నాయుడు.

"అర్ధరాత్రి నేను మనిషిని గుర్తించలేకపోయాను బాబుగారూ!" అన్నాడు బండివాడు.

"అసలు నిన్ను బాడుగబండి పెట్టుకోమని ఎవరు చెప్పారూ? నీతాతనాడెరుగుదువా నీముత్తాతనాడెరుగుదువా నువ్వు బండెక్క? చెప్పరానినాడు తన కులవృత్తి మాని ఇంకో వృత్తి చేసుకోవచ్చునని ఏ శాస్త్రంలో ఉందో చెప్పరా? గాడిదకొడకా! తెలియక ఒకవేళ నాబోటివాడు బండికట్టమంటేమాత్రం, ఆమైన ర్ణాశ్రమధర్మాలు నాశనంచేయడానికి పరేనని తయారవుతావా? 'నేను చెప్పరానివాణ్ణి సామీ!' అని చెప్పనక్కర్లే?" అని వెంకటశాస్త్రి పండ్లు పటపటకొరుకుతూ పరవళ్లు తొక్కుతున్నాడు.

"చెప్పుతో మూతి పగలకొట్టండి వెధవను. మదం అణుగుతుంది" అన్నాడు నాయుడు.

"తెలియక చేశాను సామీ" అన్నాడు బండివాడు.

"ఛీ! మళ్లా ఆకూతే కూస్తావు. తెలియదంటే నే నమ్ముతానా? పదేళ్లుగా రక్తమాంసాలు వోడ్చి చదువుకొన్నశాస్త్రం అంతా తగలడిపోయిందే. కాశీసమారాధన చేసుకొందామని కష్టపడి గంగ తెచ్చుకొన్నాను. అంతా నాశనం చేశాడు. ఈగాడిదకొడుకు."

"వీడి కన్నీ తెలుసు. — ఇట్లాంటిపని చేయవు కదా అని పండబెట్టి పట్టకారుతో రెండు గుడ్లూ ఒత్తిస్తే రోగం కుదురును. — అబ్బబ్బ! నాకేసులో ఆకురకవాళ్లూ, వీళ్లూ చేరి నాగడ్డి నాకు పెట్టారు— శాస్తుర్లూ! ఈవందమందిమీదా కేసు రుజువుచేయించి, జైలుకు వేయించేవరకు పన్నెండువే లయింది నాకు. ఎవరు తిన్నట్టు చెప్పండీ? మీబోటి బ్రాహ్మడికిచ్చినా దీపంపెట్టుకొని తలుచుకొనేవారు. ఆజడ్జి ధర్మప్రభువు కాబట్టి వీళ్లెన్నికూతలు కూసినా మనవారనే నమ్మి శిక్ష వేశాడు" అన్నాడు నాయుడు.

ఇంతలో అక్కడచేరిన అగ్రహారీకు లందరూ తలాఒకబడితె చేతపట్టుకొని "అగ్రహారంలో అడుగుపెట్టి అపవిత్రంచేసినందుకు వీణ్ణి తల పగలకొట్టండి, చంపండి. ఆబండినీ, ఎద్దునూ కిరసనాయిలుపోసి నిప్పుపెట్టండి" అని తలొకమాటా అందుకొన్నారు. నాయుడికి వేడెక్కింది: కేసు అయిందిలగాయతు ఒంటెద్దుబండివాడంటే అసలే మండిపడుతున్నాడు నాయుడు.

"అయితే వీడి కేంశిక్ష చెప్తారు వెంకటశాస్త్రిగారూ" అని ఆవేడిమీద అడిగాడు నాయుడు.

"భండాలుణ్ణి తాకితే, బ్రాహ్మణులు ఒళ్లు తెగ్గాల్చుకొంటేనేగాని ఆపాపం పదహ్నాలుగుజన్మాల దాకా పోదని శాస్త్రం. నాకు కావలసిన ప్రాయశ్చిత్తం వీడికి శిక్ష—" అన్నాడు శాస్త్రి.

నాయుడు వెంటనే ఇద్దరుమనుష్యుల్ని పిలిచి, బండివాణ్ణి పశువులదొడ్లో పగ్గాలతో గుంజకు కట్టించాడు. గంపెడుపిడకలు దాలిచేయించి, బొటనవేలు లావు ఇనపకర్రు అగ్నిహోత్రంలో పెట్టించి చేటతో విసిరిస్తున్నాడు.

బండివాడు ఒకవిపరీతమైనస్థితిలో పడ్డాడు. చినికి చినికి గాలివాన అయింది వ్యవహారం. ఇట్లా జరుగునని తాను కలలోకూడా అనుకోలేదు. వెయ్యిపెద్దపులుల్లో ఒక్క లేడిపిల్ల! ఇంతమంది అగ్రహారీకుల్ని తానొక్కడూ ఎట్లా ఎదుర్కొగలడు? ఎవరితో మొరపెట్టుకొంటాడు? తాను చేసిన తప్పేమిటో అర్థం గాకుండా ఉంది. బండివాడికి. ఇక తనచావు నిజమని స్థిరపర్చుకొన్నాడు వాడు. నోటివెంబడిమాట రావడం లేదు. గొంతుక ఎండిపోతున్నది. దాహ మవుతున్నది: ఒంటేలుకు పోవలసిన అవసరంగా ఉన్నది: కాని కాలూచెయ్యీ కదపడానికి వీల్లేనిస్థితిలో ఉన్నాడు. తనకళ్లఎదుట నల్లని ఇనపకర్రు ఎర్రబడుతోంది ఉత్తరక్షణం తలుచుకొంటే గుండె నీరయిపోతోంది "ఎంతపాపం చేసుకొన్నానోగదా భగవంతుడా! నాకు నిష్కారణంగా ఇంతశిక్ష ఏల విధిస్తున్నావో నారాయణమూర్తి తండ్రీ" అని లోపల దుఃఖిస్తూ కళ్లుమూసుకొన్నాడు.

ఇంతలో వెంకటశాస్త్రి నాయుణ్ణి చాటుకు పిలిచి "నాయుడూ! మనం చేసేపని పైకి పొక్కితే, ఆపోలీసువాళ్లవల్ల తంటా రాదుగదా! కాస్త ఆలోచించు నువ్వుకూడా!" అన్నాడు.

"అంత పిచ్చిపని చేస్తా ననుకొన్నావా శాస్తుర్లూ. పోలీసులు మనం కూర్చోమంటే కూర్చోవాలె, నుంచోమంటే నుంచోవాలె!" అని ధైర్యంచెప్పాడు నాయుడు.

"అయితే తొందరగా కానీ" అని వెంకటశాస్త్రి ఉత్తర్వు ఇచ్చాడు.

కర్రు ఎర్రబడిందో లేదో చూడమన్నాడు నాయుడు.

పోలయ్య కొంచెం వ్యక్తిగలమనిషి; కొంచెం చదువుకొన్నవాడుకూడాను. చిన్నతనంనుండీ పట్నవాసంలో పుట్టిపెరిగినమనిషి: మంచీ, శబ్బరా, దేశకాలపరిస్థితులూ కాస్త తెలుసుకొన్నవాడు. కళ్ళు మూసుకొన్న కొంతసేపటికి ఒక ఆలోచన తట్టింది అతగాడికి. "చచ్చేవాళ్లం ఎట్లాగా చస్తాం. అబద్ధమైతే అయింది, ఈదారి తొక్కి ఒకదొంగెత్తు వేదాం. నారాయణమూర్తి సాయపడకపోతాడా?" అని నిశ్చయపర్చుకొని, మొండిధైర్యం తెచ్చుకొని, నాయుణ్ణీ, శాస్త్రినీ ఉద్దేశించి,

"నన్ను మీ రీప్రకారం హింసిస్తున్నారు. నేను చచ్చినా, బ్రతికినా ఈ విషయం పైకి పొక్కక మానదు. మా పాదిరీదొరగారికి ఈ సంగతి తెలిస్తే, మీరు ఇంతకింతా అనుభవిస్తారు; మీరే బలవంతులని అనుకోకండి. మేము మీ మతం విడిచి క్రయిస్తవమతం తీసుకొన్నాకూడా మీ రీప్రకారం మమ్మల్ని ఏడిపించడం మా ఏసుప్రభువు గమనిస్తూనే ఉన్నాడు" అని పెద్దగా వెర్రిఅరుపు అరుస్తూ కేకపెట్టాడు.

బండివాడినోటినుండి ఈ మాటలు వినవచ్చేవరకు, శాస్త్రీ, నాయుడూ ఒకరి ముఖం ఒకరు చూసుకొన్నారు. "ఇదేమిటి మతం తీసుకొన్నా నంటున్నాడు" అని ఇద్దరూ కొంత తటపటాయించారు.

"నువ్వు క్రయిస్తవుడవా?" అని శాస్త్రి అడిగాడు.

"అవును: మా తాత తనహయాంలో మతం పుచ్చుకొన్నాడు" అని బింకంగా జవాబు చెప్పాడు.

"నీపేరు?"

"పోలయ్య."

"బండిలో చెప్పడంలో నీపేరు పోలయ్య అని చెప్పావే!"

"లేను; పాలయ్యనే చెప్పాను."

"నీతండ్రి పేరు"

"జకరయ్య"

వెంటనే కట్టినకట్లు విప్పమని నాయుడు ఉత్తర్వు చేసి, శాస్త్రీ, తనూ గడ్డివామిచాటుకు పోయారు.

వెం— రాత్రి చెప్పడంలో పోలయ్యఅని చెప్పాడయ్యా, దొంగవేషం వేస్తున్నాడేమో?

నా— మీరు పొరపాటుగా వినిఉంటారు; పాలయ్యకు బదులు పోలయ్యఅని మీకు వినిపించి ఉంటుంది. తల చూడండి, వాడికి క్రాపింగుకూడా ఉంది. సందేహంలేదు, వీడు క్రయిస్తవుడే!

వెం— క్రాపింగుకేం గాని క్రయిస్తవు డయితే కొంచెం ఆలోచించదగ్గదే.

నా—అమ్మా! ఇంకా నెమ్మదిగా అంటున్నారా? ఈ పాదిరీలకీ, సర్కారువారికీ చాలాదోస్తీ ఉంటుందండీ! వాళ్ళు పట్టుపట్టారంటే సీమదాకా కూడా వెళ్లి తగవులాడుతారు. అంతవరకొచ్చేవరకు ఎంత డబ్బిచ్చినా ఈపోలీసులు మనముఖాజా ఏమీ ఉంచకుండా తోసిరా జంటారు మనల్ని; కాబట్టి తొందరపడగూడదు.

వెం— సరే! అట్లాగే నీ ఇష్టప్రకారమే కానీ! అతిసర్వస్వతవజ్ఞయే త్తన్నాడు శాస్త్రకారుడు. ఇదీగాక, నిజంగా వీడు క్రయిస్తవుడే అయితే మన కంతపట్టింపు లేనేలేదు. మనప్రభువుల మతం అదే అయినపుడు, ఆమతాన్ని నిందిస్తే ప్రభువుని నిందించినట్లే! "నావిష్ణుః పృథ్వీపతిః"; కాబట్టి రాజు అవలంబించిన మతంలోకూడా విష్ణ్వంశ ఉండితీరుతుంది. — మన మతంలోనేకాని, వాళ్లమతంలో చండాలురంటూ లేనే లేరు. కాని ఎటువచ్చీ నాసందేహం ఏమంటే, వీడు నిజంగా క్రయిస్తవుడేనా అని?

నా— అయినా కాకపోయినా, ఈవిషయంలో మట్టుకు మనం తగ్గడమే శ్రేయం. ఏమో! ఏపుట్టలో ఏపాముందో! వాడు ఉత్తరాది తెనాలంటున్నాడు. అక్కడ వాడి కేంప్రాపకముందో, ఎవడు చూడొచ్చాడు?

వెం— అవునవును. వాడింకా మంచివాడు కాబట్టే ఇంతదూరం ఊరుకొన్నాడు.

అని శాస్త్రీ తృప్తిపడి మళ్లా బండివాడి కంట బడకుండా సందుదారిన దొడ్లో దూరాడు. నాయుడు పాలయ్యకు కట్టినకట్లు విప్పించి, ఇంటికి తీసుకొనిపోయి రు 3-0-0 లు చేతిలో పెట్టి అన్నంపెట్టించి ఇంటికి పంపివేశాడు.